

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి వెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 170 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు మంగళవారం, అక్టోబరు 20, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



కనకదుర్గమ్మ ఆశీస్సులతో
రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి
సాధించాలి

రాష్ట్ర ప్రజలకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దసరా శుభాకాంక్షలు

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ మనకు గొప్ప స్ఫూర్తి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి : రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దసరా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విజయదశమి. ఈ నేపథ్యంలో సోమవారం తన ఎక్స్ ఖాతా వేదికగా ఏపీ ప్రజలకు ఆయన దసరా శుభాకాంక్షలు చెప్పారు. 'రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ మనకు గొప్ప స్ఫూర్తిని ఇస్తుంది. రైతన్న శ్రమకు తగిన ఫలితం, మహిళలకు సాధికారత, యువతకు మంచి భవిష్యత్తు అందించేందుకు మేం చేస్తున్న సంకల్పానికి ఆ జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నాను'. 'ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాష్ట్ర ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

ప్రజల నమ్మకాన్ని తమ ప్రభుత్వం...
వమ్ము చేయలేదు...!!

వైకాపా నేతలు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారు..!!

- ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రాధాన్యత
- స్థానిక ఎన్నికల పరిణామాలపైనా ఆయన స్పందించారు
- వైకాపా నేతలు వ్యవహరిస్తున్న తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం
- రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక గొడ్డలిపార్టీ నేతలు రోడ్లు తవ్వుతున్నారు
- మెగా డీఎస్సీని అడ్డుకోవాలని అనేకసార్లు కోర్టులకు వెళ్లారు..
- గొడ్డలి పార్టీ చేసిన తప్పులు ప్రజల మనసు నుంచి ఎప్పటికీ పోవు
- గత ప్రభుత్వ విధ్వంసంతో ఏపీ బ్రాండ్ కోల్పోయాం...
- ఇప్పుడిప్పుడే దాని నుంచి కోలుకుంటున్నాం...
- వైకాపా పాలనలో ప్రజలు ప్రశాంతంగా జీవించలేదు
- స్థానిక ఎన్నికలతో పాటు ప్రతి ఎన్నికలకు ప్రాముఖ్యత ఉంటుంది
- కేంద్రం, రాష్ట్రం, స్థానికం మూడింటికీ చాలా ప్రాధాన్యత ఉంది
- స్థానిక సంస్థలు బలోపేతమైతేనే నిజమైన అధికార వికేంద్రీకరణ
- గొడ్డలి పార్టీ విధ్వంసం వల్లే కూటమి ఘన విజయం సాధించింది
- ఎక్కడా లేనివిధంగా 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఘన విజయం సాధించాం
- రూ.లక్షన్నర కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నాం
- రాయలసీమను మళ్లీ రతనాల సీమ చేస్తామని చెప్పాం
- అభివృద్ధిలో దేశానికే రాయలసీమను ఒక నమూనాగా తయారుచేస్తాం
- గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల నిధులు మళ్లించేశారు
- జల్‌జీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేశారు : సీఎం చంద్రబాబు

..2a శేషలో



అమరావతి: ప్రజల నమ్మకాన్ని తమ ప్రభుత్వం వమ్ము చేయలేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రాధాన్యత అని తెలిపారు. ఉండవల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. స్థానిక ఎన్నికల పరిణామాలపైనా ఆయన స్పందించారు. వైకాపా నేతలు వ్యవహరిస్తున్న తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక గొడ్డలిపార్టీ నేతలు రోడ్లు కూడా తవ్వుతున్నారని చంద్రబాబు మండిపడ్డారు. వైకాపా నేతలు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారన్నారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలని అనేకసార్లు కోర్టులకు వెళ్లారని..



యెమెన్ ట్రైనింగ్ క్యాంప్‌పై
హౌతీల దాడి..

53 మంది మృతి

యెమెన్‌లోని షబ్వా ప్రావిన్స్‌లో హౌతీలు సోమవారం భీకర దాడి చేశారు. ఇరాన్ మద్దతున్న హౌతీ రెబెల్స్.. ప్రభుత్వ భద్రతా బలగాల శిక్షణ శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో 53 మంది మరణించగా, 200 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు. శిక్షణ కార్యక్రమం జరుగుతున్న సమయంలో హౌతీలు తమ భద్రతా దళాలపై మూడు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. కాగా.. యెమెన్ ట్రైనింగ్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని దాడి చేశామని హౌతీ మిలిటరీ ప్రతినిధి యహ్యా సరీ ఎక్స్‌లో తెలిపారు. ఆ శిక్షణ శిబిరాన్ని సౌదీ బలగాలు నడుపుతున్నాయని ఆయన చెప్పారు. అయితే, సరీ కామెంట్లపై సౌదీ అధికారులు స్పందించలేదు. హౌతీల ఆధీనంలో ఉన్న ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వ బలగాలు ఈనెల నుంచి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. కాగా.. గత నెలలో బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని హౌతీలు దాటడంతో హౌతీలకు, సౌదీల నేతృత్వంలోని కూటమి మద్దతు ఉన్న అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి మధ్య భీకరంగా పోరు జరుగుతోంది.



అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి...

ప్రతీక దసరా

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉంది
- దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుంది
- ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలి
- ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి
- ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలి
- ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటి చెబుతుంది
- తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం,

2



అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో తన్వీర్ మరణశిక్ష అమలుపై సుప్రీంకోర్టు స్టే

అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసులో దోషిగా తేలిన ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది మొహమ్మద్ తన్వీర్ మరణశిక్ష అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

రోడ్డు తవ్వేసిన వైకాపా నేతలు..
ఆగ్రహించిన పవన్ కల్యాణ్!

రూ. 4.75 కోట్లతో నిర్మించిన రోడ్డును సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి కలిసి 100 మీటర్ల మేర ట్రాక్టర్‌తో దున్నేశారు



- ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోడ్డుని ధ్వంసం చేయడం క్షమించరానిది నేరం
- రోడ్డు ధ్వంసం చేసిన వ్యక్తిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు పెట్టాలని ఆదేశం
- ప్రజా ధనంతో నిర్మించిన రహదారిని ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య...
- ఆ చర్యలకి పాల్పడ్డ నాయకులు, వారి వెనుక ఉన్నవారినీ కూడా చట్టం ముందు నిలబెట్టాలి

అమరావతి : తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని అనంతసముద్రం గ్రామం నుంచి పాపక్కగారి పల్లె వెళ్లే బీటీ రోడ్డును వైకాపా నాయకులు తవ్వేయటంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను పవన్ తీవ్రంగా పరిగణిస్తూ.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన వైకాపా నాయకుడు సుబ్బారెడ్డిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారం రోజుల క్రితం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ. 4.75 కోట్లతో నిర్మించిన రోడ్డును సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి కలిసి 100 మీటర్ల మేర ట్రాక్టర్‌తో దున్నేశారని, గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు వివరించారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోడ్డుని ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని పవన్ అన్నారు. రోడ్డు ధ్వంసం చేసిన వ్యక్తిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు పెట్టాలని ఆదేశించారు. ప్రజా ధనంతో నిర్మించిన రహదారిని ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య అనీ, ఆ చర్యలకి పాల్పడ్డ నాయకులు, వారి వెనుక ఉన్నవారినీ కూడా చట్టం ముందు నిలబెట్టాలన్నారు.


ఏపీలో పారిశ్రామిక అభివృద్ధికి
అనుకూల వాతావరణం..!!

- ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి.. పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉంది
- అల్ట్రాటెక్ సిమెంట్ ప్లాంట్‌ను ప్రారంభించిన నారా లోకేశ్
- శంకుస్థాపన నుంచి ప్లాంట్ ప్రారంభం వరకు కేవలం 14 నెలలే పట్టింది
- కూటమి ప్రభుత్వ వేగానికి ఇదే నిదర్శనం
- ఈ సిమెంట్ ప్లాంట్ ద్వారా 2,650 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి
- భూగర్భజలాలు వినియోగించకుండా సిమెంట్ ప్లాంట్ నిర్వహణ చేపడుతున్నాం
- వందశాతం గ్రీన్ ఎనర్జీతో పని చేసేలా సిమెంట్ ప్లాంట్ ఏర్పాటు : నారా లోకేశ్

నంద్యాల : ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి.. పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. నంద్యాల జిల్లా పెట్నికోటలో రూ.2,650 కోట్లతో నిర్మించిన అల్ట్రాటెక్ సిమెంట్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. శంకుస్థాపన నుంచి ప్లాంట్ ప్రారంభం వరకు కేవలం 14 నెలలే పట్టిందని, కూటమి ప్రభుత్వ వేగానికి ఇదే నిదర్శనమని చెప్పారు. ఈ సిమెంట్ ప్లాంట్ ద్వారా 2,650 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భూగర్భజలాలు వినియోగించకుండా సిమెంట్ ప్లాంట్ నిర్వహణ చేపడుతున్నట్లు చెప్పారు. వందశాతం గ్రీన్ ఎనర్జీతో పని చేసేలా సిమెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వైకాపా నేతలు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారు..!!



(మొదటిపేజీ తరువాయి) గొడ్డలి పార్టీ చేసిన తప్పులు ప్రజల మనసు నుంచి ఎప్పటికీ పోవు అని వ్యాఖ్యానించారు.

వైకాపా చేష్టలకు పరాకాష్ఠ... స్థానిక సంస్థలు బలోపేతమైతేనే నిజమైన అధికార వికేంద్రీకరణ... "గత ప్రభుత్వ విధ్వంసంతో ఏపీ బ్రాండ్ కోల్పోయాం. ఇప్పుడిప్పుడే దాని నుంచి కోలుకుంటున్నాం. వైకాపా పాలనలో ప్రజలు ప్రశాంతంగా జీవించలేదు. స్థానిక ఎన్నికలతో పాటు ప్రతి ఎన్నికలకు ప్రాముఖ్యత ఉంటుంది. కేంద్రం, రాష్ట్రం, స్థానికం మూడింటికీ చాలా ప్రాధాన్యత ఉంది. స్థానిక సంస్థలు బలోపేతమైతేనే నిజమైన అధికార వికేంద్రీకరణ. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రజలకు భద్రత, భరోసా కల్పించాం. గొడ్డలి పార్టీ విధ్వంసం వల్లే కూటమి ఘన విజయం సాధించింది. ఎక్కడా లేనివిధంగా 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఘన విజయం సాధించాం.

చెప్పిన సమయానికి లబ్ధి చేకూరుస్తున్నాం... రూ.లక్షన్నర కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. సంక్షేమ క్యాలెండర్ ఫిక్స్ చేసి చెప్పిన సమయానికి లబ్ధి చేకూరుస్తున్నాం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నాం. ప్రభుత్వం అందించే 55 సేవలపై నిత్యం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాం. లోపాలు ఉంటే సరిదిద్దుకుంటున్నాం. రాయలసీమను మళ్లీ రతనాల సీమ చేస్తామని చెప్పాం. అభివృద్ధిలో దేశానికే రాయలసీమను ఒక నమూనాగా తయారుచేస్తాం. వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా.. మళ్లీ నేను వచ్చాకే ఫేజ్-1 పూర్తిచేశా. మార్కాపురం ఇక కరవు ప్రాంతం కాదు.. అన్ని పంటలు పండే ప్రాంతంగా తయారుచేస్తాం. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల నిధులు మళ్లించేశారు. 93 కేంద్ర పథకాలు నిలిపివేశారు. జల్‌జీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేశారు. కేంద్రంతో మాట్లాడి దాన్ని పునరుద్ధరించాం" అని సీఎం వివరించారు.

అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి...

ప్రతీక దసరా

(మొదటిపేజీ తరువాయి) మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని వివరించారు. ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తులపై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తు చేస్తుందని అన్నారు. తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మి చెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటి చెబుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

బాసర ఆలయంలో ఆలయంలో

మరో గోల్‌మాల్..

ప్రసాద సామాగ్రిని మాయం చేసిన సిబ్బంది!

నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో మరో గోల్‌మాల్ తెరపైకి వచ్చింది. ప్రసాదం తయారీ సరుకుల చోరీ వ్యవహారం చర్చకు దారి తీసింది. లడ్డూ, పులిహోర తయారీ కోసం తెచ్చిన సరుకులను కొందరు సిబ్బంది బయట షాపులో విక్రయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలోని ప్రసాదాల తయారీ కేంద్రంలో చోరీ వెలుగులోకి వచ్చింది. ఈ నెల 16న మూల నక్షత్రం సందర్భంగా భక్తులు కోసం లడ్డూ, పులిహోర తయారీకి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే.. ప్రసాదాల తయారీ కోసం 15వ తేదీ సాయంత్రం ఆలయంలోని స్టోర్ నుంచి కావాల్సిన సరుకులు తీసి బయట ఉంచారు. అయితే ఇదే అదునుగా భావించిన కొందరు ఇంటి దొంగలు. ఈ సరుకుల్లోని కొన్నింటిని ఆటోలో తరలించి బయట వ్యక్తులకు విక్రయించారు. అయితే ఈ సరుకుల చోరీకి సంబంధించి దృశ్యాలన్నీ ఆలయంలోని సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ఈ దృశ్యాలను గుర్తించిన టెక్నికల్ టీమ్.. ఈ విషయాన్ని వెంటనే బాసర ఆలయ ఈవో అంజనాదేవికి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ప్రసాదం సరుకుల చోరీ జరిగినట్టు గుర్తించి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ గోల్‌మాల్‌లో ఒక పర్మినెంట్ ఎంప్లాయ్.. మరొకరు తాత్కాలిక ఉద్యోగి ఉన్నట్టు తేల్చారు. తాత్కాలిక ఉద్యోగిని ఏజెన్సీకి సరెండర్ చేయగా.. స్టోర్ ఇన్‌చార్జ్‌గా ఉన్న పర్మినెంట్ ఉద్యోగికి ఘటనపై వివరణ కోసం నోటీసులు ఇచ్చారు. ఉద్యోగి వివరణ తర్వాత శాఖపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు ఆలయ ఈవో అంజనాదేవి. అలాగే సరుకుల చోరీని గుర్తించిన టెక్నికల్ టీమ్ సభ్యులను ఈవో అంజనాదేవి అభినందించారు. అయితే.. ఇలాంటి ఘటనలు ఇప్పుడే జరిగాయా?.. గతంలో ఏమైనా చోటుచేసుకున్నాయా?.. అనే దానిపై విచారణ చేయనున్నట్టు ఈవో అంజనాదేవి ప్రకటించారు.

హైదరాబాద్‌లో మరో కొత్త కమిషనరేట్..

ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. ఫ్యూచర్ సిటీలో కొత్తగా నిర్మించిన పోలీస్ కమిషనరేట్‌ను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న పలు కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనులను పరిశీలించారు.



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. సోమవారం ఫ్యూచర్ సిటీలో కొత్తగా తగ్గా నిర్మించిన పోలీస్ కమిషనరేట్‌ను అధికారికంగా ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ జూ తరుణ్ జోషిని కుర్చీలో కూర్చోబెట్టిన సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఆ తర్వాత.. విద్యా, పట్టణ ప్రణాళికా రంగాలకు సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు సీఎం. అనంతరం ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రధానంగా.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శించి.. నిర్మాణ పనులను ఆరా తీశారు. యూనివర్సిటీ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయి?.. మౌలిక వసతుల కల్పనపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?.. అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించబోయే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ సన్నాహక ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (చీ×ఖవీ) క్యాంపస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆధునిక పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కొనే సాంకేతిక నిపుణులను, అర్బన్ ప్లానర్లను తీర్చిదిద్దడంలో ఈ క్యాంపస్ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందనుంది. ఆయా కార్యక్రమాల తర్వాత.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ నెట్‌వర్క్ లాంటి మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడుల ఆకర్షణ, భూసేకరణ పురోగతిపై చర్చించారు.

హైకోర్టులో వైకాపాకి మరో ఎదురుదెబ్బ

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైకాపాకి హైకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర బలగాల భద్రతతో స్థానిక ఎన్నికలు జరపాలన్న వైకాపా పిటిషన్‌ను ఉన్నత



న్యాయస్థానం కొట్టివేసింది. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల భద్రత ఉంచేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని వైకాపా కోరింది. వైకాపా అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఈ నెల 16న హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ తీర్పునిచ్చింది. దీనిపై వైకాపా.. డివిజన్ బెంచ్‌కు వెళ్లింది. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ పిటిషన్‌ను కొట్టివేసింది.

అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో...

తన్వీర్ మరణశిక్ష అమలుపై సుప్రీంకోర్టు స్టే

అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసులో దోషిగా తేలిన ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది మొహమ్మద్ తన్వీర్ మరణశిక్ష అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసులో దోషిగా తేలిన ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది మొహమ్మద్ తన్వీర్ మరణశిక్ష అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఆ పేలుళ్ల కేసులో అంతకుముందు 38 మంది ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాదులకు గుజరాత్ హైకోర్టు వేసిన మరణశిక్షను తన్వీర్.. సుప్రీంకోర్టులో సవాలు చేశాడు. అతని పిటిషన్‌ను విచారించిన బెంచ్ అతని మరణశిక్ష అమలుపై స్టే విధిస్తూ ఈనెల 9న ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఆ కేసు ఒరిజినల్ రికార్డులను సమర్పించాలని ట్రయల్ కోర్టుతో పాటు హైకోర్టును ఆదేశించింది. తన్వీర్‌కు సంబంధించి



ప్రొబేషన్ అధికారులు సిద్ధం చేసిన రిపోర్టులను 8 వారాల్లోగా సమర్పించాలని గుజరాత్ ప్రభుత్వానికి కూడా బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అలాగే, జైల్లో ఉన్న సమయంలో తన్వీర్ ప్రవర్తనకు సంబంధించి 8 వారాల్లోపు పూర్తి వివరాలు ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌నూ ఆదేశించింది. అలాగే అతనికి ప్రభుత్వ ఆసుపత్రిలో సైకలాజికల్ పరీక్షలు చేయించాలని, దానికి సంబంధించిన రిపోర్టులను కూడా 8 వారాల్లోపు సమర్పించాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచించింది. తదుపరి విచారణను 12కు వారాలకు వాయిదా వేసింది. కాగా.. ఈ పేలుళ్ల కేసులో స్పెషల్ కోర్టు 2022 ఫిబ్రవరిలో 38 మందికి మరణశిక్ష, 11 మంది జీవితఖైదు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఆ తీర్పును ఈ ఏడాది జులై 7న గుజరాత్ హైకోర్టు సమర్థించింది. తర్వాత దోషులు చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది. కాగా.. 2008 జులై 26న అహ్మదాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 70 నిమిషాల వ్యవధిలో 21 బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో 56 మంది చనిపోగా.. 200 మందిపైనే గాయపడ్డారు.

సంపాదకీయం

చెరకు రైతుల ఆందోళనలు..

ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం డీకే శివకుమార్ లేఖ

ఉత్తర కర్ణాటకలో చెరకు రైతుల ఆందోళనలతో చక్కెర మిల్లుల్లో పని నిలిచిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం జోక్యాన్ని కోరింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం డీకే శివకుమార్ లేఖ రాశారు.



బెంగళూరు : ఉత్తర కర్ణాటకలో చెరకు రైతుల ఆందోళనల కారణంగా చక్కెర మిల్లుల్లో చెరకు క్రషింగ్ నిలిచిపోవడంతో ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసాన్ని ముట్టడించేందుకు రైతులు నిర్వహిస్తున్న పాదయాత్రలు, రహదారుల దిగ్బంధనాల వల్ల ప్రజాజీవితం తీవ్రంగా ప్రభావితమవుతోందని, చెరకు పంట చేతికొచ్చి పొలాల్లోనే పాడైపోతోందని సీఎం లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి లేఖలోని ప్రధానాంశాలు:

1. చక్కెర మద్దతు ధర (మీ్రా) పెంపు

2019 ఫిబ్రవరి నుంచి చక్కెర కనీస మద్దతు ధర కిలోకు రూ.31 గానే ఉంది. కానీ, చెరకు మద్దతు ధర టన్నుకు రూ.2,750 నుంచి రూ.3,650కి పెరిగింది. పాత చక్కెర ధరల వద్ద మిల్లులు రైతులకు సరైన గిట్టుబాటు ధరను చెల్లించలేకపోతున్నందున వెంటనే ఎంఎస్‌పీని సవరించాలని కోరారు.

2. దేశీయ, వాణిజ్య అవసరాలకు వేర్వేరు ధరలు

సాధారణ గృహ వినియోగదారులకు భారం పడకుండా ఉంటూనే.. బల్క్ కమర్షియల్ కొనుగోలుదారుల నుంచి సరైన ధర రాబట్టేలా చక్కెర ధరల వర్గీకరణ చేయాలని సూచించారు.

3. ఇథనాల్ సేకరణ టెండర్ విధానం సమీక్ష

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు(ఓఎంసీ) ఇటీవల విడుదల చేసిన టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్ ద్వారా తయారు చేసే ఇథనాల్‌ను మినహాయించడం సరికాదని పేర్కొన్నారు. ఇది మిల్లుల ఆదాయాన్ని దెబ్బతీసి, రైతులకు చెల్లింపులు నిలిచిపోయేలా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

4. చెరకు ఆధారిత ఇథనాల్ ధరల పెంపు

ఎఫ్ఆర్‌పీ నిరంతరం పెరుగుతున్నప్పటికీ, చెరకు రసం ద్వారా తయారు చేసే ఇథనాల్ ధరలు 2022-23 నుంచి పెరగలేదని, ధాన్య ఆధారిత ఇథనాల్ ధరలను పెంచినప్పే వీటిని కూడా పెంచాలని కోరారు.

5. ఎఫ్ఆర్‌పీ రికవరీ బేస్ 9.50శాతానికి తగ్గింపు

చక్కెర రికవరీ బేస్‌ను 10.25 శాతానికి పెంచడం వల్ల తక్కువ రికవరీ ఉండే ప్రాంతాల రైతులకు పూర్తి ఎఫ్ఆర్‌పీ అందడం లేదని, పాత పద్ధతి ప్రకారం.. దీనిని తిరిగి 9.50 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు... రాష్ట్ర పరిధిలోని అధికారాలను ఉపయోగించి ఇప్పటికే చక్కెర మిల్లుల డిజిటల్ వేయింగ్ సిస్టమ్, ల్యాబ్ అక్రిడిటేషన్లు, టన్నుకు అదనంగా రూ.100 చొప్పున(ఇందులో రూ.50 రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ) రైతులకు రూ.290 కోట్లు విడుదల చేసినట్లు లేఖలో స్పష్టం చేశారు. అయితే, రైతుల ప్రధాన డిమాండ్లు కేంద్ర పరిధిలోనే ఉన్నందున ప్రధాని మోదీ తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఎల్‌నీనో ఎఫెక్ట్.. కొత్త బోర్లకు పర్మిషన్ ఇవ్వొద్దు..

అధికారులకు సీఎస్ కీలక ఆదేశాలు!

ఎల్‌నీనో ఎఫెక్ట్ కారణంగా.. రాష్ట్రంలో తాగునీటి, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు తెలంగాణ ప్రభుత్వ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే తాజాగా ఉన్నతాధికారుతో కీలక సమావేశం నిర్వహించారు సీఎస్ సంజయ్ జాజు ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వొద్దని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.



ఎల్‌నీనో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్ని పరిస్థితులపై సోమవారం ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కీలక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్ సమస్య తలెత్తకుండా మండల స్థాయి వరకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరా కొనసాగుతుందని.. ఎలాంటి పవర్ కట్స్ ఉండవని.. యాజమాన్యాలు టెన్షన్ పడొద్దని ఆయన తెలిపారు. అలాగే హైదరాబాద్ నగరంలో కొత్త నిర్మాణాల కోసం బోర్లు వేసేందుకు ఎవరికి పర్మిషన్‌లు ఇవ్వద్దని అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు నగరంలో నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా నగరంలో నీటి కొరత లేకుండా చూసేందుకు నవంబర్ 1 నుంచి నిర్మాణ పనులకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయబోతున్నట్టు సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు ఉన్నతాధికారులు. మరోవైపు రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి, తగిన చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కేబినెట్ సబ్ కమిటీకి చైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యవహరించనుండగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సభ్యురాలిగా నియమితులయ్యారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో కమిటీ ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించనుంది. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. తాగునీటి సరఫరాపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. అలాగే కరవు పరిస్థితులను అధిగమించేందుకు జల సంరక్షణ చర్యలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనుందని స్పష్టం చేశారు.

కిట్టు రెడ్డి సహకారంతో..
దసరా క్రికెట్ టోర్నీ ముగింపు

నల్లమాడ, అక్టోబరు 19, అమరావతి వెలుగు : నల్లమాడ యువత ఆధ్వర్యంలో టీ.డీ. కిట్టు రెడ్డి సహకారంతో నిర్వహించిన పుట్టపర్తి నియోజకవర్గ స్థాయి దసరా క్రికెట్ టోర్నమెంట్--2026 ఘనంగా ముగిసింది. ఈ పోటీల్లో పుట్టపర్తి జట్టు విజేతగా నిలవగా, నల్లమాడ ఎఫ్‌సీటీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.25 వేలు, రన్నరప్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతులను టీ.డీ. కిట్టు రెడ్డి అందజేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ సతీష్, టీ.డీ. రఘునాథ రెడ్డి, ఎన్.హెచ్. బాషా, కే. హరి, మంజునాథ రెడ్డి, సతీష్, రషీద్ ఖాన్, వేణు, ఈశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సోము రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నల్లమాడ యువత తరపున నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కోచ్ పి. హనీఫ్ మాట్లాడుతూ అందరి సహకారంతో పోటీలను విజయవంతంగా నిర్వహించామని, భవిష్యత్తులోనూ యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తామని తెలిపారు.



పెండింగ్ జీతాలు వెంటనే...
విడుదల చేయాలి

పుట్టపర్తి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో వాటర్ వర్క్స్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. ఓబులు డిమాండ్ చేశారు. జీతాలు అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల చెల్లింపు కోసం కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులతో చర్చలు జరిపి, పెండింగ్ జీతాల విడుదలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో ప్రతినెలా వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పైపల్లి గంగాధర, అంకె ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ, జడ్పీటీసీ...
ఎన్నికల షెడ్యూల్ విడుదల

అమరావతి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదే రోజు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనుండగా, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



కర్నూలు జీజీహెచ్‌లో రోగుల సహాయకులకు
వసతులు కరువు

కర్నూలు, అక్టోబరు 19, అమరావతి వెలుగు : కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో రోగుల సహాయకులు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని ఎం.లింగాపురం గ్రామానికి చెందిన సగినాల సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులు, సహాయకులకు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు, బెంచీలు లేకపోవడంతో పాటు రాత్రి వేళల్లో విశ్రాంతి తీసుకునేందుకు వసతి గదులు అందుబాటులో లేవని తెలిపారు. దీంతో మహిళలు, వృద్ధులు సహా పలువురు ఆసుపత్రి వెలుపల రోడ్ల పక్కన, చెట్ల కింద నిద్రించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పేదలకు అందుబాటు ధరల్లో భోజనం లభించే సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రోగుల సహాయకుల కోసం రాత్రి బస చేసేందుకు విశ్రాంతి గదులు, కూర్చునేందుకు షెడ్లు, బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా లేదా తక్కువ ధరకు భోజనం అందించే క్యాంటీన్ లేదా అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఓటమి భయంతోనే కూటమి నేతల దౌర్జన్యాలు
: అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం, అక్టోబరు 19, అమరావతి వెలుగు : మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కూటమి నేతలు వైకాపా అభ్యర్థులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. సోమవారం నగరంలోని నవోదయ కాలనీకి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ గాయత్రితో పాటు 27, 29వ డివిజన్లకు చెందిన పలు కుటుంబాలు ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో అనంత వెంకటరామిరెడ్డి, వైకాపా మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్ సమక్షంలో పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో గత రెండున్నరేళ్లుగా దౌర్జన్యాలు, దోపిడీలు పెరిగిపోయాయని, పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని సామాన్యుల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పేదల ఇళ్లు, స్థలాలను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని ఎమ్మెల్యే అనుచరులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. కూటమి పాలనపై ప్రజలు విసిగిపోయారని, నగరంలోని అన్ని డివిజన్లలో వైకాపా అభ్యర్థులకు ప్రజాదరణ లభిస్తోందని పేర్కొన్నారు. మేయర్



అభ్యర్థి సి.రమేష్ గౌడ్‌తో పాటు 62 డివిజన్లలో పోటీ చేస్తున్న వైకాపా కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించేందుకు నగర ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో విఫలమైందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రజలకు ఉపశమనం కల్పించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, నాయకులు చిరంజీవి, గుజ్జల నారాయణ, సంపంగి రవికుమార్, సర్దార్, తిరుపాలు, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న...
హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత

కదిరి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలోని శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత సోమవారం దర్శించుకున్నారు. ఆలయ తూర్పు రాజగోపురం వద్దకు చేరుకున్న ఆమెకు దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేసి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రాలతో పాటు ప్రసాదాలను అందజేశారు.



రాప్తాడులో వైసీపీకి షాక్..
టీడీపీలోకి 25 మందికి పైగా కార్యకర్తల చేరిక

రాప్తాడు, అక్టోబరు 19, అమరావతి వెలుగు : స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. ఎమ్మెల్యే పరిటాల సునీత



ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరగా, మరోవైపు ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు కొనసాగుతోంది. కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గుజ్జల సురేష్, వినోద్ కుమార్, చిన్న నారాయణ, మధుసూదన్, భాస్కర్‌తో పాటు మరో 25 మంది క్రియాశీలక కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పరిటాల సునీత పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా, రాప్తాడు మండలంతో పాటు అనంతపురం రూరల్ పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్లు, స్థానికంగా ప్రజల్లో ఉన్న ఆదరణ, కార్యకర్తల మద్దతును పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం తుది జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

దసరా సందర్భంగా జిల్లా ప్రజలకు...
ఎస్పీ శుభాకాంక్షలు

పుట్టపర్తి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ దసరా శుభాకాంక్షలు తెలిపారు.









జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఆయుధ పూజలో ఎస్పీ తన సతీమణి ధరణ్యతో కలిసి పాల్గొన్నారు. తొలుత దుర్గాదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పోలీసు ఆయుధాలు, శాఖకు చెందిన వాహనాలకు పూజలు చేశారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సుఖసంతోషాలు నింపాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు, మీడియా ప్రతినిధులు, పోలీసు అధికారులు, సిబ్బంది ఆనందోత్సాహాలతో దసరా పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అంకిత సురానా, ఏవో వేణుగోపాల్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ రాఘవన్, ఆర్ఐలు వలి, మహేష్, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ఐ ప్రదీప్ సింగ్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతి గ్రామంలో లాడ్జీల తనిఖీలు

పుట్టపర్తి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ప్రశాంతి గ్రామంలోని లాడ్జీలను పోలీసులు తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ మాణిక్యరావు పర్యవేక్షణలో పట్టణ సీఐ యువరాజు సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లో బస చేస్తున్న వ్యక్తుల వివరాలను పరిశీలించి, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ మనోహర్, కానిస్టేబుల్ హరినాథ్, హోంగార్డులు ప్రసాద్, మారుతి పాల్గొన్నారు.



హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందంజ

అనంతపురం, అక్టోబరు 19, అమరావతి వెలుగు : 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పల్లె నుంచి పట్టణం వరకు అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రగతి నివేదిక కరపత్రాన్ని ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. గృహ నిర్మాణ పథకం కింద 1,707 ఇళ్లు, 4,334 మందికి ఇంటి స్థలాలు, 2,475 తాగునీటి కనెక్షన్లు, 13,261 విద్యుత్తు కనెక్షన్లు కల్పించినట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా 7,260 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. 149 కిలోమీటర్ల అంతర్గత రహదారులు, 46 కిలోమీటర్ల ప్రధాన రహదారులు, 12 కిలోమీటర్ల డ్రైనేజీ పనులు చేపట్టడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ఎన్టీఆర్ భరోసా



పింఛన్లకు రూ.624.68 కోట్లు, తల్లికి వందనం కింద రూ.147.75 కోట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రూ.136.98 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వెల్లడించారు. అన్న క్యాంటీన్ల ద్వారా 4.60 లక్షల భోజనాలు, దీపం-2.0 పథకం కింద 97,123 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు విస్తృతంగా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విభాగాలతో పాటు 34 ప్రత్యేక విభాగాలు ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని ఆదేశించారు. ఎస్సీ, ముస్లిం మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించాలని, ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దతు కోరుతూ అభ్యర్థులు వీడియోలు రూపొందించాలని తెలిపారు. 'మై టీడీపీ' యాప్ ద్వారా ఈ నెల 27 వరకు జరిగే ప్రచారం, ప్రజల స్పందన, లబ్ధిదారుల అభిప్రాయాలను ఐటీ బృందం పర్యవేక్షిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

కదిరి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కదిరి పట్టణ పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ శివనారాయణ స్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ బి. వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ఆదివారం నిజాంవలి కాలనీలో పర్యటించి వీధి కూడళ్లలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని ప్రజలకు సూచించారు. ప్రలోభాలకు, రెచ్చగొట్టే మాటలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమావేశమై ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, వారి అనుచరుల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో హింసకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద ఘటనలు లేదా సమాచారం ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.





మేయర్‌కు 29.. 62 డివిజన్లకు
460 నామినేషన్లు

అనంతపురం నగరపాలక సంస్థలో నామినేషన్ల పరిశీలన పూర్తి

అనంతపురం, అక్టోబరు 19, అమరావతి వెలుగు : అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026కు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. మేయర్ పదవికి 29 నామినేషన్లు, 62 డివిజన్లకు సంబంధించి 460 నామినేషన్లను అధికారులు పరిశీలించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్‌రావు వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించగా, అనంతరం నామినేషన్ల పరిశీలన చేపట్టారు. మేయర్ పదవికి దాఖలైన 29 నామినేషన్లలో స్వతంత్ర అభ్యర్థులవి 13 ఉండగా, బీజేపీ నుంచి 4, కాంగ్రెస్ నుంచి 3, వైఎస్సార్‌సీపీ నుంచి 3, నవతరం పార్టీ నుంచి 3, బీఎస్పీ, టీడీపీ, ఆమ్ ఆద్మీ పార్టీల నుంచి ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.





62 డివిజన్లకు పార్టీల వారీగా.. నగరంలోని 62 డివిజన్లకు సంబంధించి టీడీపీ నుంచి అత్యధికంగా 202 నామినేషన్లు, వైఎస్సార్‌సీపీ నుంచి 173, జనసేన నుంచి 26, బీజేపీ నుంచి 14, సీపీఎం నుంచి 5, సీపీఐ నుంచి 3, కాంగ్రెస్ నుంచి 3, బీఎస్పీ నుంచి 2 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 32 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్‌రాజ్, ఐఏఎస్ పరిశీలించారు.

మడకశిరలో జనసేనకు..
మొండిచేయి..

చైర్మన్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

మడకశిర, అక్టోబరు 19, అమరావతి వెలుగు : మడకశిర నగర పంచాయతీలో జనసేన పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ చైర్మన్ అభ్యర్థి ఎస్. శ్రీనివాసులు నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. నామినేషన్ పత్రాల్లో కొన్ని వివరాలను ఖాళీగా వదిలేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. జనసేన డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన సంజీవరత్న, రామకృష్ణ నామినేషన్లు కూడా తిరస్కరణకు గురయ్యాయి. దీంతో మడకశిరలో జనసేనకు చైర్మన్ అభ్యర్థి లేకుండా పోయిన పరిస్థితి నెలకొంది. జనసేన నామినేషన్లలో లోపాలున్నాయంటూ టీడీపీ నాయకులే అభ్యంతరాలు వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. పొత్తు ధర్మాన్ని పాటించని టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని జనసేన వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

అనంతపురంలో వైఎస్సార్‌సీపీలోకి...
టీడీపీ మైనార్టీ నాయకుడు ముక్తియార్ చేరిక

అనంతపురం, అక్టోబరు 19, అమరావతి వెలుగు : అనంతపురం నగరంలో టీడీపీకి చెందిన 14వ డివిజన్ బూత్ ప్రెసిడెంట్ కె.ఎం. ముక్తియార్ తన అనుచరులు, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, అనంతపురం నగర మేయర్ అభ్యర్థి సీ. రమేష్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముక్తియార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. ముక్తియార్‌తో పాటు ఈడిగ రామకృష్ణ, జి. రాజ్‌కుమార్, మాధవ, రాఘవ, బాషా, షర్మన్, సలీమ్, షఫీ, జావిద్, బాషా మదీనా, ఎం. షఫీ, రియానా, నూర్‌జహాన్, గౌసియా బీ, లక్ష్మమ్మ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలు పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.



అనంతపురంలో కూటమి ఎన్నికల ప్రచార భేరి

అనంతపురం, అక్టోబరు 19, అమరావతి వెలుగు : నగరంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచార భేరి మోగించారు. 48వ డివిజన్ నుంచి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ పాల్గొన్నారు. తొలుత రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు, అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్‌తో పాటు 48వ డివిజన్ టీడీపీ అభ్యర్థి సంగీతను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల విషయంలో వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అరాచకాలను మరిచిపోయి జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టడం, కవ్వింపులకు పాల్పడటం, అనంతరం ఫిర్యాదులు చేయడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. ఓటమి భయంతోనే గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి బ్యాచ్‌లను ప్రోత్సహించింది గత ప్రభుత్వమేనని విమర్శించారు. వ్యవస్థలను అవమానిస్తూ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని, ఫ్యాక్షన్ కక్షలను మళ్లీ రెచ్చగొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ అనంతపురం నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఒకే కూటమికి చెందినవిగా ఉంటే అభివృద్ధి పనులు వేగంగా సాగుతాయని తెలిపారు. గత రెండున్నరేళ్లలో రూ.1,300 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, రూ.300 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు పనులను పూర్తి చేశామన్నారు. రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు ఉద్యోగావకాశాలు పెరిగాయని తెలిపారు. పుట్టపర్తికి యుద్ధ విమానాల పరిశ్రమ తరలివచ్చిందని, హంద్రీ-నీవా జలాలను కుప్పం, మడకశిర ప్రాంతాల వరకు తీసుకెళ్లామని వివరించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నగరంలో మరింత అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ మాట్లాడుతూ సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన బీసీ వ్యక్తికి మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కూటమి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం యువత జీవితాలను నాశనం చేసిందని, వారిని గంజాయి, అక్రమ దందాల వైపు మళ్లించిందని విమర్శించారు. విధ్వంసకర పాలన కారణంగానే ప్రజలు గత ఎన్నికల్లో వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారని వ్యాఖ్యానించారు. గతంలో కేంద్ర సహకారంతో రూ.300 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టిన విషయాన్ని ప్రస్తావించారు. అనంతపురం నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు, కూటమి అభ్యర్థులు విజయం సాధించిన వెంటనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.







జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్
విజయదశమి శుభాకాంక్షలు

పుట్టపర్తి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, విజయాలను నింపాలని ఆకాంక్షించారు. శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాలనా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ పేర్కొన్నారు.



ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న
ఎన్నికల పరిశీలకుడు అరుణ్‌బాబు

కదిరి, అక్టోబరు 19, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు పి. అరుణ్‌బాబు సోమవారం కదిరి శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ తూర్పు రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేసి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను ఆయనకు అందజేశారు.



నగర అభివృద్ధే లక్ష్యం..

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

అనంతపురం, అక్టోబరు 19, అమరావతి వెలుగు : అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి చిట్లూరు (బీసీ) రమేష్ గౌడ్ సోమవారం పలువురు సీనియర్ నాయకులు, స్థానిక నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని పేర్కొంటూ, బీసీ బిడ్డగా తనను ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. మరోవైపు నగరంలోని నవోదయ కాలనీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో జరిగిన ఈ చేరికలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మేయర్‌గా ఎన్నికైతే నగరంలోని తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని రమేష్ గౌడ్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలని కోరారు. నగరంలోని 62 డివిజన్లలో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బీజేపీ నేత డాక్టర్ విక్రమ్‌ను, సీనియర్ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామి రెడ్డిని రమేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ప్రసన్నాయనపల్లి మాజీ సర్పంచ్ మహానందరెడ్డి, ఇండియన్ డ్రైవింగ్ స్కూల్ బాబు, వారి మిత్రబృందంతో సమావేశమయ్యారు. మాజీ ఎంపీపీ వీరారెడ్డి, మాజీ ఏపీఎస్ఐడీసీ రాష్ట్ర చైర్మన్ నల్లపరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుబ్బారెడ్డిని కలిసి ఆశీర్వాదాలు కోరారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సైతం ఆయనకు మద్దతు ప్రకటించారు.



నవోదయ కాలనీలో చేరికలు.. నగరంలోని 27, 29వ డివిజన్ల పరిధిలోని నవోదయ కాలనీలో ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాయత్రి నేతృత్వంలో 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ అభ్యర్థి చిట్లూరు రమేష్ గౌడ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి తదితరులు పాల్గొని కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. వైసీపీ విధానాలపై నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు గాయత్రి తెలిపారు.

అమ్మవారి దర్శనం...

నగరంలోని నాలుగో రోడ్డు నడిమివంక సమీపంలోని శ్రీ గంగాభవాని ఆలయంలో రమేష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. నగర ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పార్టీ విజయం కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే గోపాల్, వాసగిరి నాగరాయల్, కురవ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576